క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు


స్వయంభూ విఘ్నేశ్వర స్వామి

కె.కోటపాడు: మల్లంపాలెంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాల పోటీతోపాటు షటిల్ టోర్నమెంట్, ముగ్గుల పోటీలను నిర్వహించనున్నారు. అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

వలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్లకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆయన తన సొంత నిధులతో వీటిని కొనుగోలు చేసి వీరితోపాటు పంచాయతీ వార్డు సభ్యులకు, వెలుగు సిబ్బందికి, గ్రీన్ అంబాసిడర్లకు చీరలు పంచిపెట్టారు.

169 మందికి ఆరోగ్య పరీక్షలు


వైద్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా కె.సంతపాలెంలో 169 మందికి చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద మంచాన పడిన దీర్ఘకాలిక రోగులను పరామర్శించి వైద్యం అందించారు. గర్భిణులను పరీక్షించారు. వైద్యాధికారి తిలక్, హెచ్ఎస్.రాము, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం శ్రీదేవి, రమణ పాల్గొన్నారు.

కెనాల్‌లో నాచు, మొక్కల తొలగింపు


కెనాల్‌లో నాచు తొలగిస్తున్న లస్కర్లు

కె.కోటపాడు: డి.అగ్రహారం–కొరువాడ గ్రామాల మధ్య రైవాడ కెనాల్‌లో పేరుకుపోయిన మొక్కలు, నాచును తొలగించే పనులను జీవీఎంసీ లస్కర్లు శుక్రవారం చేపట్టారు. రైవాడ నుంచి కెనాల్ మార్గంలో విశాఖ నగరానికి రోజూ 50 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. ఈ కెనాల్ మార్గంలో నీటి అడుగు ప్రాంతంలో నాచు, మొక్కలు ఎక్కువగా పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహ వేగం మందగిస్తోంది. దీంతో జీవీఎంసీ అధికారులు కెనాల్ మార్గంలో లస్కర్లతో మొక్కలు, నాచు తొలగించే పనులు చేపడుతున్నారు. తద్వారా నీటి ప్రవాహ వేగం మెరుగుపడుతుందని అధికారులు చెబుతున్నారు.

గొర్రెలకు జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలు


ఖండివరం ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న చిట్టినాయుడు

చీడికాడ: గొర్రెలకు జబ్బ వాపు వ్యాధి రాకుండా టీకాలు వేయాలని మాడుగుల పశు వైద్యశాఖ సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు సూచించారు. శుక్రవారం ఆయన పెదగోగాడ, ఖండివరం పశు వైద్యశాలలతోపాటు జి.కొత్తపల్లి, జైతవరం రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెల్లో వచ్చే జబ్బ వాపు వ్యాధి పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

అనకాపల్లిటౌన్ : మండలంలోని పాపయ్యసంతపాలెం గ్రామంలో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ నరసింగరావు ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడి చేసి, వారి నుంచి పేక దస్తాతోపాటు రూ.900 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


ఏ. కొత్తపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఏ.కొత్తపల్లిని దశాబ్దాలుగా వేధిస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శుక్రవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రూ. 20.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.17.70 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను, ఎంపీపీ స్కూల్‌లో నాడు–నేడుతో రూ. 18.22 ఆధునికీకరించిన తరగతి గదులను ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నుంచి రూ.1.01 కోట్లతో 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. త్వరలోనే ప్రతీ ఇంటికి కుళాయి నీరు సరఫరా చేస్తామన్నారు. ఏ. కొత్తపల్లి నుంచి నూకాలమ్మ కాలనీకి రూ. 1.18 కోట్లతో తారురోడ్డు నిర్మిస్తున్నామన్నా రు. అనంతరం అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కొద్ది సేపు ముచ్చటించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరామర్శించి, అభాగ్యుల కు ఆర్థిక సాయం చేశారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ, మండల మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు, సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు, దాసరి సంతోష్‌కుమార్, నాగిరెడ్డి శరారినాయుడు, కాటిపాం పెదనాయుడు, ఎంపీటీసీలు పోతల వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాద రావు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు టి.రమణ, ఏ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం

గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ


దుర్గాకాలనీలో ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: జగనన్న దయవల్ల మూడేళ్లలో ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాం, మా కష్టాలు తెలుసుకుని పథకాలన్నీ నేరుగా తమ ఇంటికే అందిస్తున్నారు. అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎదుట ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చోడవరం సచివాలయం–3 పరిధిలోని దుడ్డువీధి, ప్రేమ సమాజం, దుర్గకాలనీ, ఇందిరా కాలనీ, ఐటీ కాలనీ, ఫిషర్ మెన్ కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్ల సేవలను స్థానికులు ప్రశంసించారు. ప్రతీ ఇంటికి ఏదో ఒక లబ్ధిని ప్రభుత్వం అందించడంతో రైతులు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలతో పనిలేకుండా ప్రజల కష్టాలు, బాగోగులు తెలుసుకోవడానికి గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ధర్మశ్రీ తెలిపారు. 9వ వార్డులో తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పక్కా గృహాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ తిరుమలరావు, ఈవోపీఆర్డీ చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, పంచాయతీ ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, వార్డు మెంబరు పొట్నూరి అప్పారావు, ఎంపీటీసీ పి. అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దాబత్తుల వాసు, కసిరెడ్డి వాసు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు డిప్యూటీ సీఎంకు ఆహ్వానం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సానిక మోదమాంబ సతకంపట్టు వద్ద నిర్వహించే సంక్రాంతి సంబరాలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం తారువ క్యాంపు కార్యాలయంలో ఉత్సవ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. మాడుగులలో తొమ్మిదేళ్లుగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ముగ్గుల పోటీలు, షటిల్ టోర్నమెంట్, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, సీనియర్ కళాకారులతో మంచంమీద మనిషి, హాస్య నాటిక, తదితర ప్రదర్శలు నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ట్రస్టు సభ్యులు, గౌరీపట్టపు మహేష్‌కుమార్, సీహెచ్. మధు, కొప్పాక రాంకీ, పచ్చికూర భార్గవ్ పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం


కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్: ధనుర్మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి తిరువీధి ఉత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. అనంతరం స్వామివారిని స్థానిక కళావేదికపై ప్రతిష్ఠించి పూజలు చేస్తామన్నారు. భోగి పండగ సందర్భంగా అదే రోజు రాత్రి 7 గంటల నుంచి రంగనాథస్వామి, గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా మేలుకొలుపు ముగింపు ఉత్సవాలు


నాగయ్యపేటలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దాతలు, గ్రామ పెద్దలు


మాడుగుల రూరల్: సింహాద్రప్పన్న దర్శనానికి బయలుదేరిన ఎం. కె.వల్లాపురం భక్తులు

దేవరాపల్లి: నాగయ్యపేటలో మేలుకొలుపు ముంగిపు ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెల గంట మోగించిన నాటి నుంచి భోగి వరకు నెల రోజులపాటు గ్రామ పురవీధుల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులో భాగంగా నగర సంకీర్తన కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పేదలకు చిరికి ఎర్రయ్యమ్మ, సన్నిబాబు దంపతులు చీరలు పంపిణీ చేశారు.

ఎం.కె. వల్లాపురంలో...

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కె.వల్లాపురం, ఎం. కోటపాడు గ్రామాల్లో మేలుకొలుపు ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సర్పంచ్‌లు శానాపతి శేషఫణి, కోట్ని లక్ష్మిల సారథ్యంలో భక్తులు సింహాద్రప్పన్న దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ రెండు గ్రామాల్లో రామసేవా భజన బృందం సభ్యులు 150 మంది ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని రోజూ తెల్లవారుజామున మేలుకొలుపు నిర్వహించారు.

ఐసీడీఎస్‌లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, చిన్నారులతో కలిసి తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. పిండి వంటలు తయారీ, భోగి మంటలు వేసి ఆనందంగా గడిపారు.

జె.నాయుడుపాలెం సంక్రాంతి పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలో తలబడుతున్న ఆటగాళ్లు

రోలుగుంట: సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని మనపల్లె అసోసియేషన్ సౌజన్యంతో జె.నాయుడుపాలెంలో శుక్రవారం పలు ఆట, పాటల పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వాలీబాల్ పోటీల్లో రోలుగుంట, రావికమతం, తదితర మండలాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా జె.నాయుడుపాలెం, రన్నరప్‌గా కొమరవోలు జట్లు నిలిచాయి. రెండో రోజు శనివారం పాటలు, క్విజ్, రంగుల పోటీలు నిర్వహించి, విజేతలకు ముగింపురోజు ఆదివారం బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు 9985057404, 9705697566 సంప్రదించాలని కోరారు.

ఘనంగా బాలయేసు పండుగ


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ జాకోబ్, క్రైస్తవులు

రావికమతం: కొత్తకోట బాలయేసు దేవాలయం పండగ శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ఫాదర్ జాకోబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జాకోబ్ దైవ సందేశం వినిపించారు.

రెండు గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం


వడ్డాదిలో మంచినీటి సరఫరాను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ


బంగారుమెట్టలో ట్యాంక్‌ల ద్వారా తాగునీరు అందిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: పండగ సమయంలో ఏర్పడ్డ తాగునీటి కష్టాలకు అధికారులు వేగవంతంగా పరిష్కారం చూపారు. బంగారుమెట్టలో మంచినీటి పథకం మోటారు మూడు రోజుల క్రితం కాలిపోయింది. మోటారు బాగు చేసే వీలు లేకుండా పోయింది. గ్రామస్తులకు మంచినీరు అందకపోవడంతో పంచాయతీ సెక్రటరీ లోవరాజు, సర్పంచ్ మేరుగు కుమారి బాబూరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సాయం రమేష్, కన్వీనర్ యెనుముల వాసులు ట్యాంకుల ద్వారా గ్రామస్తులకు తాగునీరు అందించారు. కొత్త మోటారు బిగించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేశారు. వడ్డాది మేజర్ పంచాయతీలో రెల్లి, మాదిగ వీధుల్లో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎంపీటీసీ నిధులతో శివాలయం వద్ద మంచినీటి ట్యాంకు నుంచి కొత్తగా పైపులైన్ వేసి కుళాయిలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీలు ఇంటి అప్పారావు, కోరుకొండ లీలావతి రమణ తదితర్లు ప్రారంభించి గ్రామస్తులకు తాగునీరు అందించారు. పండగ రోజుల్లో మంచినీటికి ఇబ్బందులు లేకుండా చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కల్కి అవతారంతో ధ్యాన వేంకటేశుడు



కోటంకోట : స్థానిక శివాలయం వద్ద ఉన్న ధ్యాన వేంకటేశ్వరస్వామి కల్కి అవతారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి దశావతారాల్లో చివరిదైన కల్కి అవతారంలో స్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి: తమ డిమాండ్లు పరిష్కరించాలని నేవీ నిర్వాసితులు ధర్నా చేస్తున్నారు. ఈ ధర్నా శుక్రవారానికి 75వ రోజుకు చేరింది.

మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు


ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని పరిశీలిస్తున్న చేయూత డీపీఎం వరప్రసాద్

కోటవురట్ల: మహిళలకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో మూడు మండలాల్లో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు చేయూత డీపీఎం వరప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. మహిళా మార్ట్‌కు అనుకూలంగా ఉందా లేదా? అన్న అంశంపై పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే మాడుగులలో మహిళా మార్ట్‌ను ప్రారంభించామని, కోటవురట్ల, సబ్బవరంలో 40 రోజుల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, వెలుగు డీపీఎం ఫైనాన్స్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కోరుతూ వినతిపత్రం

- మీడియా కథనాలు అసత్యం
- రొంగలపాలెం సర్పంచ్ లోవరాజు

రోలుగుంట: తాను వైఎస్సార్‌సీపీ మద్దతుతోనే నూతన పంచాయతీ రొంగలపాలెం సర్పంచ్‌గా గెలుపొందానని, ఆ పార్టీలోనే కొనసాగుతానని సర్పంచ్ రెడ్డి లోవరాజు స్పష్టం చేశారు. పార్టీలో విభేదాలు ఉన్నాయని పత్రికల్లో వచ్చిన వార్తలను శుక్రవారం ఆయన ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పంచాయతీకి భవనం లేకపోవడం, గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల మంజూరు వంటి సమస్యల పరిష్కారానికి ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మలకు గురువారం వినతిపత్రాన్ని అందజేశానన్నారు. తన పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భరోసా ఇచ్చారని, ఎంపీపీ, జెడ్పీటీసీ తనకు వెన్నుదన్నుగా ఉన్నారని వివరించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

పేదలకు చీరల పంపిణీ చేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ద్వారకానగరం గ్రామం (పాతమల్లంపేట శివారు గ్రామం)లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ కుటుంబ సభ్యులు శుక్రవారం 400 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి సమయంలో ఆరేళ్ల నుంచి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, నర్సీపట్నం పట్టణాధ్యక్షుడు ఏకా శివ, పార్టీ యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, మాజీ ఎంపీపీ కుంత్సం లక్ష్మీనారాయణ, నాయకులు, పాతమల్లంపేట పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం


ఉపాధి పనులకు హాజరైన కూలీలు

బుచ్చెయ్యపేట: చింతపాక నమ్మివాని చెరువులో ఉపాధి పనులను ఏపీవో మురళి శుక్రవారం ప్రారంభించారు. ఖరీఫ్ పనులు ముగియడంతో పీడీ సందీప్, ఎంపీడీవో సువర్ణరాజుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు తిరిగి ప్రారంభిస్తున్నామన్నారు. రోజుకు కనీస కూలి రూ.257 వచ్చేలా వేతనదారులకు మేట్లు పని కల్పించాలన్నారు. ఈసీ కొండాజీ, వీఆర్పీ ముసలినాయుడు పాల్గొన్నారు.

పాడిరైతులకు పండగ బోనస్


మాకవరపాలెం: చెక్కులు అందిస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణ


బుచ్చెయ్యపేట: బీమా నగదు చెక్కు అందిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

మాకవరపాలెం: పాడిరైతులకు పండగ బోనస్‌గా రూ.3.2 కోట్లు అందజేస్తున్నామని విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. కొండలఅగ్రహారం బల్క్‌మిల్క్ సెంటర్ వద్ద శుక్రవారం డెయిరీ సిబ్బందికి ఇన్సెంటివ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతి చెందిన డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శీరంరెడ్డి మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో 21వేల మంది పాడిరైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.3.2 కోట్లు, సిబ్బందికి ఇన్సెంటివ్‌గా రూ.18 లక్షలు ఇస్తున్నామన్నారు. ఏరియా మేనేజర్ సత్యనారాయణ, బల్క్‌మిల్క్ సెంటర్ ఇన్‌చార్జి దేముడుబాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: సంక్రాంతి పండగను పాడి రైతులు ఆనందంగా జరుపుకోవాలని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కొమళ్లపూడిలో 38 పాల సంఘాల పరిధిలోని 4,184 మంది పాడి రైతులకు రూ.63,42,989 బోనస్ బట్వాడా చేశారు. రైతుల బ్యాంకు ఖాతాలో బోనస్ జమ చేశామన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన ఎనిమిది పాడి రైతుల కుటుంబాలకు సుఖీభవ కార్డు కింద రూ.1.90 వేలు అందించారు. గున్నెంపూడికి చెందిన చెలపురెడ్డి అప్పారావు మృతి చెందగా, అతని భార్య కాసుకు రూ.లక్ష చెక్కు అందించారు. ్పంచ్‌లు, నాయకులు ముచ్చకర్ల అప్పారావు, వేపాడ మధు, సూపర్‌వైజర్లు ప్రసాద్, అప్పారావు, పాల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భోగాపురంలో పశువైద్య శిబిరం


పశువైద్య సూచలిస్తున్న డాక్టర్ లిఖిత

చోడవరం రూరల్: భోగాపురంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గోవాడ పశువైద్య కేంద్రం వైద్యాధికారి బి.లిఖిత నేతృత్వంలో ఇక్కడ రైతులకు పశుపోషణ పట్ల అవగాహన కల్పించారు. కాలానుగుణంగా పశువులకు సోకే వ్యాధులు, వాటి లక్షణాలను వివరించారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల పట్ల వివరించారు. పశువుల జీర్ణక్రియను వృద్ధిపరచడానికి ఉపకరించే పాముల, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. వాటిని పశువులకు వేయాలని సూచించారు.